స్వచ్ఛ గ్రామాలు

- జగనన్న స్వచ్ఛ సంకల్పంతో గ్రామాల్లో అహ్లాదకర వాతావరణం
- జిల్లాలో 489 పంచాయతీల్లో స్వచ్ఛత కార్యక్రమాలు
- చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలతో సత్ఫలితాలు
- జిల్లాలో 335 చెత్త సంపద తయారీ కేంద్రాలు
- చెత్త సేకరణ తరలింపునకు గ్రీన్ అంబాసిడర్ల ఏర్పాటు



అయ్యలూరులో చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీపీఓ

- జిల్లాలో 485 పంచాయతీల్లో 335 చెత్త సంపద కేంద్రాలు
- చెత్తను సేకరించేందుకు 331 మంది గ్రీన్ అంబాసిడర్ల నియామకం
- కంపోస్టు ఎరువు తయారు చేయడానికి 1,449 మంది సేవమిత్రల నియామకం
- పారిశుధ్యం మెరుగుకు సామాజిక శానిటరీ కాంప్లెక్సులు, ఇంకుడు గుంతల ఏర్పాటు

నంద్యాల(అర్బన్): పల్లెలను స్వచ్ఛంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచి వ్యాధులు ప్రబలకుండా చూడటంతో పాటు పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చి గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తోంది. అన్ని పంచాయతీల్లో జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం ద్వారా చెత్త సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. తద్వారా చెత్తను తరలించడంతో పాటు ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టడంతో పల్లెల్లో స్వచ్ఛ వాతావరణం నెలకొంది. చెత్త సంపద తయారీ కేంద్రాల ద్వారా చెత్త నుంచి తయారు చేసిన ఎరువును విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరుతుంది. దీంతో గ్రామాలు అభివృద్ధి పథంలో సాగుతున్నాయి. నంద్యాల జిల్లాలో 489 పంచాయతీల్లో 335 చెత్త సంపద తయారీ కేంద్రాలను పూర్తిగా వినియోగంలోకి తెచ్చారు. మరో 82 కేంద్రాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. ఇళ్ల నుంచి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించడానికి జిల్లాలో 331 మంది గ్రీన్ అంబాసిడర్లను నియమించారు. సంపద తయారీ కేంద్రాలకు వచ్చే చెత్తను తడి చెత్త, పొడి చెత్తగా వేరి చేసి కంపోస్టు ఎరువు తయారు చేయడానికి మరో 1,449 మంది సేవా మిత్రలు పని చేస్తున్నారు. మరోవైపు పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడానికి సామాజిక శానిటరీ కాంప్లెక్సులు, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశారు.

పారిశుద్ధ్య నిర్వహణకు పెద్ద పీట..

జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం ద్వారా రిక్షాలు, ట్రాక్టర్లు, ఆటోల ద్వారా చెత్తను సేకరించడం, ఫాగింగ్ మిషన్లు, హైపర్ టాయిలెట్ క్లీనర్లతో ఎప్పటికప్పుడు గ్రామాల్లో ఫాగింగ్ చేస్తుండటంతో వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నారు. అలాగే మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడంతో పల్లెలు పచ్చదనాన్ని సంతరించుకుంటున్నాయి.

గత ప్రభుత్వంలో దోపిడీ..

టీడీపీ హయంలో సంపద తయారీ కేంద్రాల నిర్మాణంలో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు జరిగాయి. చాలా చోట్ల కేంద్రాలు నిర్మించకుండానే నిర్మించినట్లు రికార్డులు సృష్టించి జేబులు నింపుకున్నారనే ఆరోపణలున్నాయి. అయితే వీటన్నింటికీ చెక్ పెట్టిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ప్రతి గ్రామంలో చెత్త సంపద తయారీ కేంద్రాన్ని నిర్మించి గ్రామాల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది.



చాపిరేవుల చెత్త సంపద కేంద్రంలో తయారవుతున్న వర్మీకంపోస్టు

గ్రామాల పరిశుభ్రతే లక్ష్యం

గ్రామాల పరిశుభ్రతే లక్ష్యంగా ప్రభుత్వం స్వచ్ఛ సంకల్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. స్వచ్ఛ సంకల్ప కార్యక్రమాన్ని మరింత పటిష్టంగా అమలు చేసి గ్రామాల్లో పరిశుభ్రమైన వాతావరణం నెలకొల్పేందుకు కృషి చేస్తున్నాం. జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకూ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండటంతో మెరుగైన ఫలితాలు వస్తున్నాయి. – మంజులవాణి, డీపీఓ, నంద్యాల

క్లుప్తంగా

ముగ్గుల పోటీలు



ముగ్గు వేస్తున్న బాలికలు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోనున్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు హెచ్ఎం పద్మావతి, బాలభవన్ పర్యవేక్షకులు ఈ.ప్రసాదరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థినులను ప్రోత్సహించేందుకు పోటీలను నిర్వహించామన్నారు. గెలుపొందిన బాలికలకు 6వ తేదీన ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి బహుమతులు అందజేస్తారని చెప్పారు.

రైతులూ..ఆందోళన వద్దు

దొర్నిపాడు: భూ రీసర్వేలో పొలాల విస్తీర్ణంలో హెచ్చు తగ్గులు వచ్చినా రైతులు ఎలాంటి అందోళన చెందాల్సిన అవసరం లేదని తహసీల్దార్ జయప్రసాద్ తెలిపారు. శుక్రవారం జగనన్న శాశ్వత భూహక్కు మరియు భూ సురక్ష పథకంలో భాగంగా కొండాపురంలో గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఇప్పటికే భూ హక్కు పత్రాలు ఇచ్చామని వాటిలో పొలం విస్తీర్ణం తక్కువగా ఉంటే వెంటనే తగిన ధ్రువపత్రాలు ఇవ్వాలని రైతులను కోరారు. కార్యక్రమంలో డీటీ వెంకటరవి, మండల సర్వేయర్ మల్లయ్య, సర్పంచి మాధవీలత, జేసీఎస్ కన్వీనర్ శివారెడ్డి, వీఆర్ఓ రాధమ్మ పాల్గొన్నారు.

త్వరలో జొన్నల కొనుగోలు కేంద్రాలు


చాగలమర్రి: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా పౌరసరఫరాల శాఖ అనుసంధానంతో రెండు లేదా మూడు రైతు భరోసా కేంద్రాలను క్లస్టర్‌గా ఏర్పాటు చేసి జొన్నల కొనుగోలు కేంద్రాలను త్వరలోనే ఏర్పాటు చేస్తామని మండల వ్యవసాయ శాఖ అధికారి రంగనేతాజీ తెలిపారు. శుక్రవారం మండలంలోని పెద్దవంగలి గ్రామ రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన రైతు సలహామండలి సమావేశంలో మాట్లాడారు. కోనుగోలు కేంద్రంలో జొన్నలు అమ్మదలచిన రైతులు ఈ-పంటలో నమోదు చేసుకోవాలని చెప్పారు. నాణ్యత ఆధారంగా క్వింటా రూ.3180 (హైబ్రిడ్) రకానికి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందన్నారు. మండలంలో పంట రుణం తీసుకోని రైతులు ఉంటే వారికి ప్రభుత్వం కేసీసీ కార్డులు అందించి రుణ సదుపాయం కల్పిస్తుందని పేర్కొన్నారు.

కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు



నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో శుక్రవారం శ్రీకాళికాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం అనంతరం వివిధ రకాల పూజలు నిర్వహించి వివిధ పూలతో అలంకరించి ఒడి బియ్యం కార్యక్రమం జరిపించి మహామంగళ హారతులు ఇచ్చారు. అనంతరం రాహు కాల పూజలు చేపట్టారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేపట్టారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న దొరస్వామి

నంద్యాల(సిటీ): నంద్యాల రైల్వే స్టేషన్ మాస్టర్ దొరస్వామి రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఆయన మాట్లాడుతూ నరసింహ అనే వ్యక్తి గుండె శస్త్రచికిత్స కోసం ఏబీ పాజిటివ్ రక్తం అవసరమని సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ చూసి శుక్రవారం ఉదయం రోగి బంధువులను సంప్రదించి రక్తదానం చేసినట్లు చెప్పారు.

కనీస వేతనం ఇవ్వాలి

నంద్యాల(న్యూటౌన్): మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్, పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయం నుంచి శ్రీనివాస సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేపట్టారు. వారు మాట్లాడుతూ మున్సిపల్ పారిశుద్ధ్య కాంట్రాక్ట్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు రంజిత్, ప్రతాప్, శివరాముడు, మస్తానయ్య, మద్దయ్య పాల్గొన్నారు.

సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నంద్యాల(సిటీ): పట్టణంలో మున్సిపల్ కార్మికుల సమ్మె కారణంగా ఏర్పడుతున్న సిబ్బంది కొరతను అధిగమించడానికి మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసిన తాత్కాలిక సిబ్బంది సేవలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు తెలిపారు. శుక్రవారం 15వ వార్డులోని పాలిటెక్నిక్ కళాశాల వద్ద తాత్కాలిక సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. అలాగే ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రజలు చెత్తను రోడ్లు, కాల్వల్లో వేయరాదని చెప్పారు. చెత్త సేకరణ కోసం వస్తున్న సిబ్బందికి రోజువారీ చెత్త అందించాలని కోరారు. మున్సిపల్ శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ ఉన్నారు.

గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం



చిన్నవంగలిలో మాట్లాడుతున్న ఎంపీపీ వీరభద్రుడు



క్రిష్టిపాడులో మందులు అందజేస్తున్న వైద్యులు



పాండురంగాపురంలో ఆశా వర్కర్ సహకారంతో శిబిరానికి వస్తున్న వృద్ధుడు వెంకటప్పరెడ్డి

చాగలమర్రి: గ్రామీణ ప్రాంతాలకు ఉచితంగా మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టిందని ఎంపీపీ వీరభద్రుడు, ఎంపీటీసీ సభ్యుడు కె.లక్ష్మిరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు టి.రామగుర్విరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చిన్నవంగలి గ్రామంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం వైద్యాధికారి షేక్ ఇమ్రాన్, ఎంపీడీఓ మహబూబ్ దౌలా ఆధ్వర్యంలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇందుకు వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. స్త్రీ వ్యాధి నిపుణులు రాధికా ప్రత్యూష, జనరల్ ఫిజీషియన్లు రేష్మి, స్థానిక వైద్యులు తస్లీమా సుల్తానా, కంటి వైద్య సహాయకురాలు సౌజన్య వైద్య సేవలు అందించారు. సుమారు 400 మంది ఓపీ నమోదు చేసుకున్నారు. 135 మందికి రక్త పరీక్షలు నిర్వహించారని డాక్టర్ ఇమ్రాన్ తెలిపారు. అలాగే 23 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు సిఫారసు చేశామని, మరో 9 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశామని వివరించారు. సర్పంచ్ మౌలీబాషా, ఉప సర్పంచ్ శీలం రవిశంకర్‌రెడ్డి, జేసీఎస్ మండల అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, నాయకులు మల్లేశ్వర రెడ్డి, చిన్న లక్ష్మీరెడ్డి, వెంకటరెడ్డి, కేశవరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, రామలింగారెడ్డి, సీహెచ్ఓలు భాగ్యలక్ష్మీబాయి పాల్గొన్నారు.

దొర్నిపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు సొంత ఊరిలోనే ఆధునిక వైద్యం అందుతుందని ఎంపీడీఓ సుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు నాగేంద్ర, రాజశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి 379 మందికి వైద్య సేవలను అందించి మందులు పంపిణీ చేశారు. ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, సర్పంచ్ శివరామిరెడ్డి, సచివాలయ కన్వీనర్ శంకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

అందరికీ ఉచిత వైద్య పరీక్షలు

నంద్యాల(అర్బన్): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలందరికీ ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ సుగుణశ్రీ తెలిపారు. మండలంలోని పాండురంగాపురం గ్రామంలో శుక్రవారం రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏడు రకాల వైద్య పరీక్షలను 475 మందికి నిర్వహించి ఉచితంగా మందుల పంపిణీ చేశారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ జగదీశ్వరరెడ్డి, నోడల్ అధికారిణి సుజాత, డాక్టర్ షహలాం, సర్పంచ్ డోలావతమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉమామహేశ్వరరెడ్డి, పురుషోత్తమరెడ్డి, అప్పిరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ కుటుంబంతోనే పేదలకు మంచి



వైఎస్సార్ పింఛన్ కానుక అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల,



కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు

దొర్నిపాడు: వైఎస్ రాజశేఖర్ రెడ్డి కంటే ముందు పింఛన్ రూ.70 ఇచ్చేవారని, ఆయన సీఎం అయ్యాక రూ.200కు పెంచారని, ప్రస్తుతం తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.3వేల ఇస్తున్నారని... పేదలకు మంచి చేయాలంటే అది కేవలం వైఎస్సార్ కుటుంబంతోనే సాధ్యమని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మహాలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రూ.3వేల పింఛన్ పెంపు దేశంలోనే ఆదర్శం అన్నారు. భవిష్యత్‌కు గ్యారెంటీ అనేది చంద్రబాబుకు వర్తిస్తుందని, ప్రజలకు కాదని ఎద్దేవా చేశారు. దుష్టపాలన మనకు వద్దని, పేదలకు ఇంటి వద్దకు వెళ్లి సమస్యలు పరిష్కరించే ఏకైక ప్రభుత్వ వైఎస్సార్‌సీపీ అన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు సాగునీటి కష్టాలు చాలా సార్లు వచ్చినా నాడు నాయకులు కాల్వ గట్టెక్కలేదన్నారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులున్నప్పటికీ తాము తెలుగుగంగ, కేసీ కెనాల్‌కు నీటిని విడుదల చేయించి పంటలను కాపాడమని చెప్పారు. కాల్వ వెంట తిరిగి పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించి అధికారులతో మాట్లాడి వారికి అనుకూలంగా నీటిని సరఫరా చేయించామన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి సీఎంగా జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ శకుంతల, సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, సర్పంచులు మాధవీలత, మాధవీ, శివరామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ శివారెడ్డి నాయకులు మోహన్‌నాయుడు, మనోహర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శివరామిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి,దయ,శ్రీపతి ప్రసాద్, డీలర్ శివుడు, శంకర్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, పీఎంసీ చైర్మన్ నర్సిరెడ్డి, పురుషోత్తంరెడ్డి, ఎంపీటీసీ శీలం పార్వతి, ఎంపీడీఓ సుబ్బారెడ్డి, తహసీల్దార్ జయప్రసాద్,ఈఓపీఆర్డీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి

ఉయ్యాలవాడ : వర్షాభావ పరిస్థితుల వల్ల సాగు చేసిన పంటలన్నీ దెబ్బతిన్నాయని ఉయ్యాలవాడ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని బీజేపీ నాయకుడు భూమా కిశోర్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని హరివరం, నర్సిపల్లె గ్రామాల పరిధిలో గత ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసి ఎండిపోయిన పప్పు శనగ పంటలను పరిశీలించి మాట్లాడారు. ఎకరాకు రూ. 20 వేల వరకు పెట్టుబడి పెట్టామని, పంటను పరిశీలించి నష్ట పరిహారం చెల్లించాలని రైతులు విజ్ఞప్తి చేశారు. అంబటి మహేశ్వరరెడ్డి, ఆవుల రాఘవేంద్రారెడ్డి, దూదేకుల బాబు, అబ్దుల్లా పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ప్రథమ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్ ఓ ప్రకటనలో శుక్రవారం కోరారు. ఈనెల 6వ తేదీన బనగానపల్లె పట్టణంలో జరిగే మహాసభకు జిల్లాలోని రైతులు, వ్యవసాయ కూలీలు హాజరు కావాలన్నారు. నకిలీ విత్తనాలను అరికట్టాలని, ప్రభుత్వ భూములను కబ్జా చేసి ప్లాట్లుగా మార్చి అమ్ముకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఓటర్లకు అవగాహన

రుద్రవరం: మండలంలోని టీ.లింగదిన్నెలో బూత్ లెవెల్ అధికారులు పుల్లయ్య, ఓబయ్య, నాగనరసింహుడు శుక్రవారం ఓటు హక్కు వినియోగంపై ఓటర్లకు డెమో ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఓటర్లు ఇబ్బందులు పడకుండా ఈవీఎం యంత్రంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.

మహిళలకు ఖోఖో పోటీలు

గోస్పాడు: మండలంలోని దీబగుంట్లలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో భాగంగా శుక్రవారం మహిళలకు ఖోఖో పోటీలు నిర్వహించినట్లు ఎంపీడీఓ అనసూయ తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో పోటీలు జరిగాయని, గ్రామస్థాయి విజేతలను మండల స్థాయికి ఎంపిక చేస్తామని చెప్పారు.

కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ

శిరివెళ్ల: పింఛన్ల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. శుక్రవారం గుండంపాడు గ్రామ సచివాలయంలో 281 మందికి ఏంపీటీసీ శ్రీనివాసులరెడ్డి, సర్వ నరసింహస్వామి ఆలయ చైర్మన్ రామాంజనేయ రెడ్డి పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కార్యవర్గ సభ్యుడు దండె ప్రతాపరెడ్డి, వేణుగోపాల స్వామి శ్రీదేవస్థానం చైర్మన్ గంగవరపు శివరామిరెడ్డి, నాయకులు దస్తగిరిరెడ్డి, ఏరువ వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.



గుండంపాడులో పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ

ఘనంగా పుస్తకావిష్కరణ



రవీంద్రనాథ్ దంపతులను సన్మానిస్తున్న కవులు

నంద్యాల(వ్యవసాయం): కర్నూలు కేవీఆర్ మహిళా కళాశాల తెలుగు ఉపన్యాసకురాలు డాక్టర్ దండె బోయిన పార్వతిదేవి రచించిన రసస్యందిని పుస్తకావిష్కరణ కార్యక్రమం శుక్రవారం డాక్టర్ రవీంద్రనాథ్ కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పార్వతీదేవి మాట్లాడుతూ తెలుగు సాహిత్య పోషణకు రవీంద్రనాథ్ చేస్తున్న కృషిని ప్రశంసిస్తూ నంద్యాల ఆంధ్రభోజుడుగా అభివర్ణించి ఆయనకు పుస్తకాన్ని అంకితం చేశారు. డాక్టర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ తెలుగుభాషకు పూర్వవైభవాన్ని తెచ్చేందుకు ప్రతి ఒక్కరూ నడుంబిగించాలని, సమాజంలోని రుగ్మతలు నివారించేందుకు కవులు కలం పట్టాలని కోరారు. అనంతరం రవీంద్రనాథ్ దంపతులను కవులు ఘనంగా సత్కరించారు. సాహితీ వేత్తలు జేఎస్ఆర్‌కే శర్మ, డాక్టర్ సహదేవుడు, రమణమూర్తి, శ్రీనివాసమూర్తి, లీలావతి, శేషఫణి, మహబూబ్‌బాషా, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 3, 4వ తేదీల్లో కర్ణాటక రాష్ట్రంలోని విశ్వేశ్వరయ్య యూనివర్సిటీ బెలగాంలో జరిగిన ఆల్ సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ విద్యార్థినుల బ్యాడ్మింటన్ పోటీల్లో నంద్యాలకు చెందిన శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాల విద్యార్థినులు తృతీయ స్థానంలో నిలిచారని విద్యాసంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 96 యూనివర్సిటీల నుంచి క్రీడాకారులు పాల్గొనగా రాయలసీమ యూనివర్సిటీ తరఫున పాల్గొన తమ కళాశాల విద్యార్థినులు సెమీ ఫైనల్‌లో నైపుణ్యం ప్రదర్శించి తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో రాయలసీమ యూనివర్సిటీ మాత్రమే విజేతగా నిలిచిందని రాయలసీమ యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ శివకిశోర్ తెలిపారు. క్రీడల్లో కీలక పాత్ర పోషించిన స్పోర్ట్స్ మేనేజర్ హేమంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థినులు సీహెచ్ఎస్ఆర్ ప్రణవి, ఆకాంక్ష, నామి జాహ్నవి, జీవీ సింధు, ప్రియ, ఫిరిహారిన్ పాల్గొన్నారు.



బ్యాడ్మింటన్ పోటీల్లో మూడోస్థానంలో నిలిచిన నంద్యాల విద్యార్థినులు

సమస్యలు పరిష్కరించేందుకే గ్రామసభ




టీ.లింగదిన్నెలో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దారు

రుద్రవరం: రైతుల సమస్యలు పరిష్కరించేందుకే గ్రామసభ నిర్వహించినట్లు తహసీల్దారు రవీంద్ర ప్రసాదు తెలిపారు. మండలంలోని టీ.లింగందిన్నెలో శుక్రవారం భూ రీ సర్వే అభ్యంతరాల స్వీకరణ కోసం రెవెన్యూ అధికారులు గ్రామ సభ నిర్వహించారు. తహసీల్దారు మాట్లాడుతూ గ్రామ సభలో భూ రీ సర్వే అభ్యంతరాలకు సంబంధించి రైతుల నుంచి 50 దరఖాస్తులు అందాయన్నారు. ఈ నెల 16వ తేదీ వరకు అభ్యంతారలపై దరఖాస్తులు స్వీకరిస్తామని, రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. డిప్యూటీ తహసీల్దారు మహబుబ్‌బాషా, మండల సర్వేయర్ మల్లికార్జున ప్రసాదు, వీఆర్వో పుల్లయ్య ఉన్నారు.

నేటి నుంచి గ్రామ సభలు..

గోస్పాడు: భూ రీసర్వేలో చోటుచేసుకున్న హెచ్చు తగ్గులపై గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ విజయశేఖర్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 6వ తేదీన రాయపాడు, తేళ్లపురి, 7న జూలేపల్లె, పసురపాడు, 8న సాంబవరం, 9న ఎం.కృష్ణాపురం, 10న జిల్లెల్ల గ్రామ సచివాలయ పరిధిలో గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. మొదటి, రెండవ, మూడవ విడతల్లో గ్రామాల్లో జరిగిన భూ రీసర్వేలో తప్పు ఒప్పులకు సంబంధించి మార్పులు, చేర్పులు చేసుకోవడానికి సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైతులు పొలం రికార్డులను, ధ్రువ పత్రాలను గ్రామ సభలో అధికారులకు తెలియజేసి సవరణలు చేసుకోవాలని సూచించారు.

శనగలో పంటకోత ప్రయోగం



పంటకోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న డీఏఓ మోహనరావు

పాణ్యం: మండల పరిధిలోని అనుసూరు గ్రామంలో పంట కోత ప్రయోగం చేపట్టినట్లు మండల వ్యవసాయ అధికారి జయప్రకాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అనుపూరు గ్రామంలో పంటకోత ప్రయోగం చేపట్టగా జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు పరిశీలించారు. గ్రామంలో 256, 307, 443, 445 సర్వే నంబర్లలో శనగ పంటలో పంట కోత ప్రయోగం చేశారు. నిర్దేశిత విస్తీర్ణంలో పంటకోత చేపట్టి దిగుబడిని లెక్కించారు. అనంతరం రైతులకు డీఏఓ పలు సూచనలు చేశారు. రైతులు భూసారం పెరిగేలా సేంద్రియ ఎరువులను వినియోగించాలన్నారు. పశువుల పేడ, ఇతర మొక్కలను పొలంలో కలియదున్నాలని సూచించారు. అధిక దిగుబడులు సాధించేందుకు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు.ఎస్‌బీఐ ఇన్సూరెన్స్ సిబ్బంది శరత్, ఏఈఈఓలు, ఎంపీఈఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో జొన్నల కొనుగోలు

గడివేముల: మండలంలోని రైతులు పండించిన జొన్న దిగుబడులను స్థానిక రైతు భరోసా కేంద్రాలలో మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నట్లు ఏఓ హేమసుందర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సీజన్‌లో రైతులు ఆరు వేల ఎకరాల్లో జొన్న పంటను సాగు చేసినట్లు చెప్పారు. సివిల్ సప్లైస్ ఆధ్వర్యంలో రైతు భరోసా కేంద్రాల్లో మద్దతు ధర క్వింటాలుకు రూ.3180 ప్రకారం జొన్నలను రైతుల నుంచి కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైతులు పంట నమోదు చేసుకుని ఉండాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బాలుడిపై వీధికుక్క దాడి

గడివేముల: మండల పరిధిలోని బిలకలగూడూరు గ్రామానికి చెందిన షేక్ ఉజైపా అనే బాలుడిపై శుక్రవారం వీధికుక్క దాడిచేసింది. గాయపడిన బాలుడిని గడివేముల పీహెచ్‌సీకి తరలించగా డాక్టర్లు వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. గ్రామంలో కుక్కల బెడద నివారించాలని బాలుడి తండ్రి ఇమ్రాన్ కోరారు.

జైభారత్ పార్టీ జిల్లా కో ఆర్డినేటర్ నియామకం

నంద్యాల(వ్యవసాయం): నూతనంగా ఏర్పాటైన జైభారత్ పార్టీ నంద్యాల జిల్లా కో ఆర్డినేటర్‌గా పట్టణానికి చెందిన రేగటి రఘురామిరెడ్డిని నియమించి బాధ్యతలు అప్పగించారని ఆయన తెలిపారు. శుక్రవారం విజయవాడ కార్యాలయంలో పార్టీ వ్యవస్థాపకుడు సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ తనకు నియామక పత్రాన్ని అందజేశారని చెప్పారు.

సామాజిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



సేవలపై ఆరా తీస్తున్న డాక్టర్ జఫ్రూల్లా

వెలుగోడు: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని డీసీహెచ్ఎస్ డాక్టర్ జఫ్రూల్లా శుక్రవారం తనిఖీ చేశారు. అందుతున్న వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రసవాల సంఖ్య పెంచేలా ప్రత్యేక దృష్టి సారించాలని అక్కడి సిబ్బందిని ఆదేశించారు. మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, రోగులకు అన్నిరకాల సదుపాయాలు కల్పించాలని సూచించారు.